## మళ్లీ తెరపైకి జీఎస్టీ కుంభకోణం!

**రేపటి నుంచి సిట్ విచారణ ప్రారంభం**

హైదరాబాద్, జూన్ 1 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం వాణిజ్య పన్నులశాఖలోని జీఎస్టీ స్కామ్‌ను మళ్లీ తెరపైకి తెచ్చింది. జీఎస్టీ చెల్లింపుల్లో భారీ కుంభకోణం జరిగిందనే అభియోగంపై నమోదైన కేసును విచారిస్తున్నది. 30 మంది వాణిజ్య పన్నులశాఖ అధికారులను ఈ నెల 3 నుంచి మూడు రోజుల పాటు విచారించనున్నట్టు తెలిసింది. ఆ 30 మంది అధికారులకు మే 28 నుంచి విచారణకు రావాలని నోటీసులు జారీచేసినా.. వాణిజ్య పన్నుల శాఖ అధికారుల విజ్ఞప్తి మేరకు ఈ నెల 3, 4, 5 తేదీల్లో విచారణకు రావాలని సీఐడీ సూచించింది. రూ.100 కోట్లు, అంతకన్నా ఎక్కువ వార్షిక టర్నోవర్ కలిగిన డీలర్ల పన్ను చెల్లింపులను పర్యవేక్షించిన అధికారులను సీఐడీ నేతృత్వంలోని సిట్ విచారించనున్నది. ఈ కేసులో రూ.1,400 కోట్ల మేర ప్రభుత్వ ఆదాయానికి గండిపడిందనే కోణంలోనే అనుమానించి కేసు నమో దు చేసిన వాణిజ్య పన్నులశాఖ అధికారులు మొదటి విడత విచారణలో ఎలాంటి ఆధారాలు చూపలేకపోయారు.

## ఏపీ డీజీపీగా హరీశ్‌కుమార్ గుప్తా

హైదరాబాద్, జూన్ 1 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో హరీశ్‌కుమార్ గుప్తా ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. 1992 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన హరీశ్‌కుమార్ గుప్తా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం డైరెక్టర్ జనరల్ పోస్టులో కొనసాగుతూ.. ఇన్‌చార్జి డీజీపీగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన ఆయన, పదవీ విరమణతో సంబం ధం లేకుండా పూర్తిస్థాయి డీజీపీగా రెండేండ్లపాటు పదవిలో కొనసాగనున్నారు. ఈ ఏడాది జనవరిలో ద్వార కా తిరుమలరావు డీజీపీగా పదవీ విరమణ చేసిన తర్వాత హరీశ్‌కుమార్ గుప్తాకే ఫిబ్రవరి ఒకటి నుంచి ఇన్‌చార్జిగా ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. దీంతో ఆయన్ను పలువురు సీనియర్ పోలీసు అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# మన నీటి హక్కులను కాలరాస్తున్న చంద్రబాబు

- తెలంగాణ అస్తిత్వంపై మళ్లీ దాడులు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- జర్నలిస్ట్ వేణుగోపాలస్వామి
- కాళేశ్వరాన్ని వినియోగంలోకి తేవాలి: ఎర్రోజు శ్రీనివాస్
- సర్కారుపై ప్రజల్లో అసంతృప్తి: రిటైర్డ్ వీసీ సీతారామారావు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ సీతారామారావు

ముషీరాబాద్ జూన్ 1 : తెలంగాణ అస్తిత్వంపై మళ్లీ దాడులు జరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీనియర్ జర్నలిస్ట్ పరాంకుశం వేణుగోపాల స్వామి సూచించారు. తెలంగాణ వికాస సమితి ఆధ్వర్యంలో 'తెలంగాణ రాష్ట్రం – వర్తమాన పరిస్థితులు' అనే అంశంపై ఆదివారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రయోజనాలకు భంగం వాటిల్లే ప్రభుత్వ చర్యలు ఏ రూపంలో ఉన్నా అడ్డుకోవాలని చెప్పారు. నీటిపారుదల రంగంలో ఏపీ కుట్రలను తిప్పికొట్టాలని పేర్కొన్నారు. ప్రాంతేతరుల పేర్లు పెట్టడంపై వికాస సమితి ఇప్పటికే నిరసన తెలిపిందని గుర్తుచేశారు. తెలంగాణ వికాస సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎర్రోజు శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ నీటి హక్కులను కాలరాసేలా ఏపీ సీఎం చంద్రబాబు వ్యవహరిస్తున్నారని, ఏపీకి హక్కు లేకున్నా బనకచర్ల ప్రాజెక్టు పేరుతో గోదావరి జలాలను దోపిడీ చేసే కుట్ర చేస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం అలసత్వం వహిస్తూ ప్రాజెక్టులను పడావు పెడుతున్నదని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కింద 140 టీఎంసీలను వినియోగించుకునే అవకాశం ఉన్నా ప్రాజెక్టుల్లో నీళ్లు నింపడం లేదని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు కింద ఉన్న రైతులకు ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏపీ జల దోపిడీని అడ్డుకోవాలని, మన సాగు నీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టును వినియోగంలోకి తేవాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ వీసీ సీతారామారావు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వంపై అన్ని వర్గాల్లో అసంతృప్తి నెలకొన్నదని, వ్యవసాయం, పరిశ్రమలు ఇలా ప్రతి రంగంలో సమస్యలు తలెత్తుతున్నాయని విమర్శించారు. ఏ స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామో ఇప్పుడు దానికి భిన్నంగా పరిపాలన సాగుతున్నదని చెప్పారు. ప్రభుత్వం తెలంగాణ చిహ్నాలను మార్చే ప్రయత్నం చేస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు విభాగం కన్వీనర్ పులి రాజు, కన్వీనర్ మియాపురం రమేశ్ తదితరులు పాల్గొన్నారు

# 'షీ టీమ్స్' గొప్ప ఆవిష్కరణ

- తెలంగాణ ఆతిథ్యం మరువలేనిది
- హైదరాబాద్ అనుభవం మరపురానిది
- అవకాశం వస్తే మళ్లీ వస్తా : మిస్ వరల్డ్ సుచాత



హైదరాబాద్, జూన్1 (నమస్తే తెలంగాణ) : మహిళల భద్రత కోసం తెలంగాణలో షీ టీమ్స్ ఏర్పాటు గొప్ప ఆవిష్కరణ అని, హైదరాబాద్ అనుభవం తన జీవితంలో మరపురానిదని, అవకాశం వస్తే మళ్లీ హైదరాబాద్‌కు వస్తానని మిస్ వరల్డ్–2025 విజేత ఓపల్ సుచాత (థాయిలాండ్) వెల్లడించారు. హైదరాబాద్ హోటల్ ట్రైడెంట్‌లో ఆదివారం ఆమె మాట్లాడారు. మిస్ వరల్డ్ నిర్వహణకు ప్రభుత్వం అందించిన సహకారానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. హైదరాబాద్ అందమైన నగరమని, ఇక్కడి ప్రజలు స్నేహపూర్వకంగా ఉన్నారని కొనియాడారు. థాయిలాండ్‌కు ఇది మొట్టమొదటి మిస్ వరల్డ్ క్రౌన్ అని, అది తనకు ఎంతో గర్వకారణమని, పెద్ద బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. దేశ ప్రజలతో పాటు, హైదరాబాద్‌లో తమ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానని వెల్లడించారు. బ్యూటీ విత్ పర్పస్ – సేవా కార్యక్రమాలను ప్రపంచ వ్యాప్తంగా విస్తరిస్తానని, థాయిలాండ్‌లో బ్రెస్ట్ కాన్సర్‌పై ప్రజల్లో అవగాహన కోసం పని చేస్తూ ఫండ్ రైజింగ్ చేస్తున్నానని, ఇకపై తన పర్పస్ ప్రాజెక్ట్‌తో పాటు ఇతర కంటెస్టెంట్స్ పర్పస్ ప్రాజెక్ట్స్‌పై మిస్‌వరల్డ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కృషి చేస్తానని, మహిళా సాధికారత, సమస్యలపై పనిచేస్తానని, సేవకార్యక్రమాలను ప్రపంచ వ్యాప్తంగా విస్తరిస్తానని వెల్లడించారు. తెలంగాణ ప్రజల ఆతిథ్యం మరువలేనిదని, ఎప్పటికీ తన మదిలో నిలిచిపోతారని, ఇక్కడి కళలు, సంప్రదాయాలు, డ్యాన్స్, మ్యూజిక్ ఎంతో ఆకట్టుకున్నాయని, షీ టీమ్స్, మహిళల విద్య, వైద్యం, ఐటీ, మొదలైన రంగాల్లో ఆవిష్కరణలు అభినందనీయమని కొనియాడారు.

## తెలంగాణలో తగ్గిన సైబర్ నేరాలు

- నాలుగు నెలల్లో 19% తగ్గిన ఆర్థికనష్టం
- వివరాలు వెల్లడించిన డీజీ శిఖాగోయెల్

హైదరాబాద్, జూన్ 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో సైబర్ నేరాలపై ఫిర్యాదులు, ఆర్థిక నష్టాలు గణనీయంగా తగ్గినట్టు రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) డీజీ శిఖాగోయెల్ ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ ఏడాది మొదటి నాలుగు నెలల గణాంకాలను విడుదల చేసిన ఆమె.. నిరుడు ఏప్రిల్ వరకు పోల్చితే సైబర్ నేరాల ఫిర్యాదుల్లో 11%, ఆర్థిక నష్టాల్లో 19% తగ్గుదల నమోదైందని తెలిపారు. ప్రజలు కోల్పోయిన నగదు రికవరీ శాతం13నుంచి 16శాతానికి పెరిగిందని పేర్కొన్నారు. బ్యాంకులు, టెలికాం సంస్థలతో సమన్వయం చేసుకుంటూ.. సైబర్ నేరాల తగ్గుముఖం పట్టేందుకు విశేష కృషిచేశామని వివరించారు. డిజిటల్ అరెస్టులు, పెట్టుబడి మోసాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించామని తెలిపారు. 1930 హెల్ప్ లైన్, చాట్‌బాట్ ద్వారా వేగంగా సైబర్ నేరస్థులకు వెళ్లిన నగదును నిలిపివేయగలిగామని ఆమె వెల్లడించారు. ఈ ఏడాదిలో ఇప్పటికే 7,575 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, 626మందిని అరెస్టు చేశామని చెప్పారు. సైబర్ నేరాలు ఎక్కువగా జరిగే హాట్‌స్పాట్లను గుర్తించేందుకు డేటా విశ్లేషణ చేయడంతోపాటు, డిజిటల్ ప్రొఫైలింగ్, ఓఎస్ఐఎన్‌టీ వంటి సాధనాలను సీఎస్‌బీ వినియోగిస్తున్నద తెలిపారు. సైబర్ నేరాలపై ప్రజలు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని ఆమె కోరారు.

## 5 తర్వాతనే తెలంగాణకు ప్రభాకర్‌రావు?

**పాస్‌పోర్టు పునరుద్ధరణకు ఇండియన్ ఎంబసీలో సంప్రదింపు**

హైదరాబాద్, జూన్ 1 (నమస్తే తెలంగాణ): ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆరోపణలున్న మాజీ ఐపీఎస్ ప్రభాకర్‌రావు ఈనెల 5 తర్వాత రాష్ర్టానికి రానున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఆయన ఆదివారం అమెరికాలోని ఇండియన్ ఎంబసీ కార్యాలయాన్ని సంప్రదించినట్టు తెలిసింది. రద్దయిన తన పాస్‌పోర్టును పునరుద్ధరించాలని ఎంబసీ అధికారులను కోరారు. దీంతోపాటు ట్రావెల్ ఎమర్జెన్సీ పర్మిట్ ఇవ్వాలంటూ ప్రభాకర్‌రావు రిక్వెస్ట్ పెట్టుకున్నట్టు తెలిసింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో ట్రావెల్ ఎమర్జెన్సీ పర్మిట్‌ను ఎంబసీ అధికారులు జారీ చేసినట్టు సమాచారం. వచ్చేవారం ప్రభాకర్‌రావు హైదరాబాద్‌కు వచ్చే అవకాశం ఉందని తెలంగాణ పోలీసు అధికారులు చెబుతున్నారు. ఇండియాకు చేరుకున్న 3 రోజుల తర్వాత ఆయన సిట్ ఎదుట హాజరుకానున్నారు.

## ప్రభుత్వంపై వ్యతిరేకత నిజం!

- రుణమాఫీ, రైతుభరోసాకు ఆశించిన మైలేజ్ రాలేదు
- సీఎంతో భేటీలో మంత్రులు
- 4న ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి, శాఖల మార్పుపై చర్చ
- 5న క్యాబినెట్ భేటీకి నిర్ణయం



హైదరాబాద్, జూన్1 (నమస్తే తెలంగాణ): రైతు రుణమాఫీ, రైతు భరోసాకు ఆశించిన మైలేజీ రాలేదని ముఖ్యమంత్రి, మంత్రులు అంతర్మథనం చెందుతున్నట్టు సమాచారం. సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంత్రులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉన్నదని పలువురు మంత్రులు అభిప్రాయపడ్డట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. పార్టీ రాష్ట్రవ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ప్రత్యేకంగా ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, ముఖ్యనేతలతో సమావేశం కావడం, ప్రభుత్వం, మంత్రుల పనితీరుపై వివరాలు సేకరిస్తుండటంపై చర్చించినట్టు తెలిసింది. పలువురు మంత్రుల వ్యక్తిగత వ్యవహారాలు, వాటి పర్యవసానాలపైనా వాడివేడిగా చర్చ సాగినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. కొందరు మంత్రుల పనితీరు బాగాలేదని, మెరుగు పడాల్సిందేనని సీఎం స్పష్టం చేసినట్టు సమాచారం. అధిష్టానం నిర్ణయమే ఫైనల్ అని హెచ్చరించినట్టు తెలిసింది. ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టడంలో చాలా వెనుబడ్డామని,అందరూ సమాన బాధ్యత తీసుకోవాలని మంత్రులకు సూచించినట్టు చెప్పుకుంటున్నారు. ఇక ఉద్యోగుల నుంచి ప్రభుత్వానికి సహకారం తగ్గుతున్నదని, రెండు డీఏలు ఇస్తే బాగుంటుందని సూచించగా, క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకుందామని చెప్పినట్టు తెలిసింది. ఈ నెల 5వ తేదీన క్యాబినెట్ సమావేశాన్ని నిర్వహించాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర అవతరణ వేడుకలు, ఇందిరమ్మ ఇండ్లు, రెవెన్యూ సదస్సులు, వానకాలం సాగు సన్నద్ధత, రాజీవ్ యువ వికాసంపై మంత్రులు అందించిన నివేదికపైనా సమావేశంలో చర్చించారు. అనర్హులకు రాజీవ్ యువ వికాసం అందకుండా చూడాలని ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో పూర్తిస్థాయి పరిశీలన తరువాతే అర్హుల జాబితాలను ప్రకటించాలని, ఈ అంశంపై క్యాబినెట్‌లో చర్చించాలని నిర్ణయించారు. రాష్ట్ర అవతరణ వేడుకలను పురస్కరించుకుని ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

### 4న ఢిల్లీకి సీఎం రేవంత్ రెడ్డి?

సీఎం రేవంత్ రెడ్డి ఈ నెల 4న ఢిల్లీకి వెళ్లనున్నట్టు తెలిసింది. మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానంతో కీలక చర్చలు జరిపే అవకాశం ఉన్నదని సమాచారం. ఢిల్లీ పెద్దలు సూచించిన జాబితాకు సీఎం ఆమోదం తెలిపిన నేపథ్యంలో, మంత్రివర్గ విస్తరణపై 4న ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉన్నదని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. మరోవైపు ఇప్పుడున్న మంత్రుల శాఖల మార్పుపైనా నిర్ణయం తీసుకోవచ్చని సమాచారం. మంత్రుల తొలగింపుపై అధిష్ఠానం నుంచి ఎలాంటి స్పష్టత రాలేదని తెలిసింది.


## యూపీఏ హయాంలో అన్నీ కుంభకోణాలే




హైదరాబాద్, జూన్1 (నమస్తే తెలంగాణ): యూపీఏ హయాంలో ఎక్కడ చూసినా అవినీతి, కుంభకోణాలే కనిపించేవని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శించారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన రాష్ట్ర ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో అవినీతికి తావులేకుండా 11 ఏండ్లు దిగ్విజయంగా ప్రధాని మోదీ పరిపాలన కొనసాగుతుందని, దేశ సంపదలో ఒక్క రూపాయి దుర్వినియోగం కాకుండా ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నట్టు పేర్కొన్నారు. రాహుల్‌కు రాజకీయం, దేశ చరిత్రపై సరైన అవగాహన లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను డైవర్ట్ చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. హామీలను విస్మరించి, ప్రపంచ సుందరి పోటీలు నిర్వహించారని విమర్శించారు. ఈ నెల 8 నుంచి 18 వరకు మోదీ పాలనపై ప్రజల్లో అవగాహన కల్పిస్తామన్నారు.




# మదుపుతోనే గెలుపు







## ద్రవ్యసమీక్షపైనే..

**మార్కెట్ పల్స్**

**దేశీయ** స్టాక్ మార్కెట్లు లాభాలకు దూరంగా ట్రేడ్ అవుతున్నాయి. గతకొద్ది రోజులుగా మదుపరులు పెట్టుబడులకు సంశయిస్తున్నారు. ఫలితంగా సూచీలు నష్టాలకే పరిమితం కావాల్సి వస్తున్నది. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 270.07 పాయింట్లు లేదా 0.33 శాతం పడిపోయి 81,451.01 దగ్గర నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 102.45 పాయింట్లు లేదా 0.41 శాతం కోల్పోయి 24,750.70 వద్ద స్థిరపడింది. ఈ వారం కూడా సూచీలు పడుతూలేస్తూ పయనించే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. అయితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2025–26)గాను రెండో ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షను ఈ నెల 4–6 తేదీల్లో నిర్వహించనున్నది. దీంతో వడ్డీరేట్లపై ఆర్బీఐ నిర్ణయాల ఆధారంగా మార్కెట్లు ట్రేడ్ అయ్యే వీలున్నదని చెప్పవచ్చు. ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా జరిగిన రెండు ద్రవ్యసమీక్షల్లో రెపోరేటును ఆర్బీఐ అర శాతం తగ్గించిన విషయం తెలిసిందే. రాబోయే ద్రవ్యసమీక్షలోనూ మరో పావు శాతం తగ్గవచ్చన్న అంచనాలున్నాయి. ఇదే జరిగితే బ్యాంకింగ్, ఆటో, రియల్టీ, ఇతరత్రా కన్స్యూమర్ డ్యూరబుల్స్ షేర్లు ఆకర్షణీయం కానున్నాయి. సూచీలు తిరిగి లాభాలను సంతరించుకోవచ్చు. ఇక ఎప్పట్లాగే డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ, గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, విదేశీ సంస్థాగత మదుపరుల (ఎఫ్ఐఐ) పెట్టుబడులు, ముడి చమురు ధరలు దేశీయ మార్కెట్లను నిర్దేశించనున్నాయి. అయితే అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 24,300 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,000 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. కానీ సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 25,300–25,500 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

*గమనిక..*

*స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.*




**నేడు** మనం చేసే పొదుపు, పెట్టుబడులే రేపు మన భవిష్యత్తుకు రక్షణనిస్తాయి. దీర్ఘకాలంలో ఆర్థిక క్రమశిక్షణకు ఇవే సోపానాలు. ముఖ్యంగా మన ఆర్థిక లక్ష్యాల సాధనకు పెట్టుబడులే కీలకం. తెలివైన నిర్ణయాలతో చక్కని రాబడులను అందుకోవచ్చు. మరి ఇందుకున్న అవకాశాలు ఏమిటి? ఎలా ముందుకెళ్తే వాటిని సద్వినియోగం చేసుకోవచ్చు?

### డైరెక్ట్ ఈక్విటీ

స్టాక్స్‌లో పెట్టే పెట్టుబడులనే డైరెక్ట్ ఈక్విటీ అంటారు. ఏదైనా కంపెనీ షేర్లను మీరు కొన్నట్టైతే.. అందులో మీకు పాక్షికంగా యాజమాన్య హక్కులు వచ్చినట్టే. ఇక ఈ పెట్టుబడులకు స్టాక్ ఎక్స్ఛేంజీలు వేదికలవుతాయి. డీమ్యాట్ ఖాతాల ద్వారా షేర్ల క్రయవిక్రయాలను చేయవచ్చు. అయితే స్టాక్ మార్కెట్ పెట్టుబడులు అనేక అంశాలకు ప్రభావితమై ఉంటాయి. కాబట్టి ఈ ఇన్వెస్ట్‌మెంట్స్ రిస్కులతో ముడిపడి ఉంటాయి. అందుకే మార్కెట్ పరిజ్ఞానం తప్పనిసరిగా ఉండాలి.

### మ్యూచువల్ ఫండ్స్

మ్యూచువల్ ఫండ్స్ సంస్థల గురించి నేటి తరం ఇన్వెస్టర్లకు ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. మన పెట్టుబడులను స్టాక్ మార్కెట్లతోపాటు డెట్, హైబ్రిడ్ ఫండ్స్ తదితర రకరకాల సాధనాల్లో మదుపు చేస్తాయి. దీర్ఘకాలిక మదుపునకు మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులు లాభదాయకం. సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల (సిప్)తో ప్రారంభం బాగుంటుంది. అయితే ఇవి కూడా రిస్క్‌తో కూడుకున్నవే. సంబంధిత డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదివి ముందు కెళ్లాలి.

### ఫిక్స్‌డ్ డిపాజిట్లు

బ్యాంకులు, ఇతర ఫైనాన్షియల్ సంస్థలు ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డీ)ను ఆఫర్ చేస్తాయి. ఇవి సురక్షిత పెట్టుబడులు అని చెప్పవచ్చు. రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్ల ఆధారంగా డిపాజిటర్లకు వడ్డీ అదాయం ఉంటుంది. పన్ను మినహాయింపులు లభిస్తాయి. ప్రధానంగా సీనియర్ సిటిజన్లకు అనువైనవి. వీటికి లాకిన్ పీరియడ్ ఉంటుంది.

### రికరింగ్ డిపాజిట్లు

రికరింగ్ డిపాజిట్ (ఆర్‌డీ) కూడా మరో ఫిక్స్‌డ్ టెన్యూర్ ఇన్వెస్ట్‌మెంట్. బ్యాంకులు, పోస్టాఫీసుల్లో ఈ పెట్టుబడులకు అవకాశం ఉంటుంది. నెలనెలా చిన్నచిన్న మొత్తాలతో మదుపునకు వీలుంటుంది. పెట్టుబడికి రక్షణ, గ్యారంటీడ్ ఇన్‌కమ్ వీటి సొంతం.

### పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్

ఇదో దీర్ఘకాలిక పన్ను ఆదా పెట్టుబడి. పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్)కు లాకిన్ పీరియడ్ 15 ఏండ్లు. కేంద్ర ప్రభుత్వం హామీ ఉంటుంది. ప్రతీ మూడు నెలలకోసారి వడ్డీరేట్లను కేంద్రం నిర్ణయించి ప్రకటిస్తుంది.

### ఎంప్లాయీ ప్రావిడెంట్ ఫండ్

ఎంప్లాయీ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్).. వేతన జీవులకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపులు లభిస్తాయి. ఇందులో జమయ్యే నిధులకు అధిక వడ్డీరేటు లభిస్తుంది. కాబట్టి వీటిని ఉపసంహరించుకోకుండా కాపాడుకోవడం కూడా మంచి పెట్టుబడి కిందకే వస్తుంది.

### నేషనల్ పెన్షన్ సిస్టమ్

పీపీఎఫ్, ఈపీఎఫ్‌లతో పోల్చితే నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్)లో పెట్టుబడిదారులు అధిక రాబడులను పొందవచ్చు. పన్ను ప్రోత్సాహకాలుంటాయి. అయితే ఈ పథకాన్ని ఎంచుకొంటే రిటైర్మెంట్‌దాకా లాకిన్ పీరియడ్ ఉంటుంది. అయినప్పటికీ నిబంధనలకు లోబడి 40 శాతం వరకు నిధులను వెనక్కి తీసుకోవచ్చు. కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్‌పీఎస్ సబ్‌స్క్రిప్షన్ తప్పనిసరిగా ఉన్నది.

## కొంచెం కొత్తగా ఆలోచిద్దాం..

**రోజులు** మారిపోయాయి. ఒకప్పటితో పోల్చితే మదుపరులకు పెట్టుబడికున్న అవకాశాలూ పెరిగిపోయాయి. సంప్రదాయ పెట్టుబడుల స్థానంలో ఇప్పుడు హైటెక్ పెట్టుబడులు వస్తున్నాయి. నేటి తరం వీటిపై మరింతగా దృష్టి సారిస్తే గొప్ప ప్రయోజనాలనే అందుకోవచ్చు. మరి వాటిలో..

### ఏఐ ఆధారిత ఈటీఎఫ్‌లు

ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్)ల్లో పెట్టుబడుల ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ), రోబోటిక్స్, ఆటోమేషన్ తదితర నయా టెక్నాలజీ ఇన్వెస్ట్‌మెంట్స్ వైపునకు అడుగులు వేయవచ్చు. ఇప్పుడున్న పరిస్థితుల్లో భవిష్యత్తు అంతా వీటిదేనని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కాబట్టి ఏఐ ఫోకస్డ్ ఈటీఎఫ్‌లను ఎంచుకోవడం ఉత్తమమే.

### క్రిప్టో సిప్స్

బిట్‌కాయిన్ వంటి ప్రధాన క్రిప్టోకరెన్సీల్లో సిస్టమ్యాటిక్ మంత్లీ ఇన్వెస్ట్‌మెంట్స్ (సిప్).. యువతరానికి బాగా కలిసిరాగలవని మెజారిటీ నిపుణుల అంచనా. దీర్ఘకాలంలో సంపద సృష్టికి ఇవి దోహదం చేయగలవు.

### గ్రీన్ బాండ్లు, డిజిటల్ గోల్డ్

రెన్యువబుల్ ఎనర్జీ, సస్టెయినబుల్ ప్రాజెక్టుల్లో ఫండింగ్ చేసే గ్రీన్ బాండ్లనూ మదుపరులు తమ పెట్టుబడులకు ఎంచుకోవచ్చు. అలాగే యూపీఐ యాప్స్ ద్వారా సూక్ష్మ పెట్టుబడులనూ అనుసరించవచ్చు. పీర్–టు–పీర్ లెండింగ్ సాధనాలనూ పరిశీలించవచ్చు.

